# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు.**
2. **రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి.బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.**
3. **అగ్నిపథ్ పథకాన్ని సైనిక్ సమాన్ స్కీమ్‌గా మళ్లీ ప్రారంభించినట్లు ప్రచారమవుతున్న సమాచారం అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.**
4. **ఈరోజు ప్రపంచ ఎడారీకరణ, కరువు నివారణా అంశంపై అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**
5. **పశ్చిమబెంగాల్‌లో ఈరోజు జరిగిన రైలు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు.**

==========================

అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం సలీంకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 21న రష్యాలోని కజాన్ నగరంలో బ్రిక్స్ దేశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే మేయర్ల సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా మేయర్లు పాల్గొననున్నారు. భారత్ నుంచి ఐదుగురు మేయర్లకు ఆహ్వానం అందగా.. అందులో అనంతపురం మేయర్ ఒకరు. మిగిలిన వారిలో జైపూర్, క్యాలికట్, త్రిసూర్, నాగర్ కోయిల్ మేయర్లు ఉన్నారు. అనంతపురానికి, రష్యాకు చారిత్రక సంబంధం ఉంది. 550 ఏళ్ల కిందట రష్యన్ యాత్రికుడు అఫా నసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైనటువంటి అనంతపురాన్ని సందర్శించాడు.

--------------------------

ఈరోజు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, సంపాదకులు తిరుమల రామచంద్ర జయంతి. అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా రేగటిపల్లి గ్రామంలో జన్మించిన ఆయన మాతృభాష తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృత భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. విద్యార్థి దశలోనే సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. ఆయన సాహితీ ప్రతిభకు గుర్తింపుగా అనేక పురస్కారాలు లభించాయి. హంపీ నుంచి హరప్పా దాక అనే రచనకు గానూ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 1997 అక్టోబర్ 12వ తేదీన తిరుమల రామచంద్ర హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా నిన్న ప్రకాశం జిల్లాకు వచ్చిన మంత్రికి జిల్లా టిడిపి పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని తెలుపుతూ,

వాయిస్ (18 సెకన్లు)

---------------------------

పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో ఒకే ట్రాక్ పైకి వచ్చిన రెండు రైళ్లు ఢీకొనడంతో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఐదుగురు ప్రయాణికులు మృతిచెందగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. అస్సాంలోని సిల్చార్ నుంచి కోల్‌కతా లోని సీల్దాకు బయల్దేరిన కాంచన్‌జంఘా ఎక్స్‌ప్రెస్ మధ్యలో న్యూజల్‌పాయ్‌గుడి వద్ద ఆగింది. అక్కడి నుంచి బయల్దేరిన కాసేపటికే రంగపాని స్టేషన్ సమీపంలో వెనక నుంచి ఓ గూడ్స్ రైలు దీన్ని బలంగా ఢీకొట్టిందని అధికారులు చెప్పారు. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ప్రమాద ఘటనలో మృతి చెందినవారికి రెండు లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయల నష్ట పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

---------------------------

ఈరోజు ప్రపంచ ఎడారీకరణ, కరవు నివారణా అంశంపై అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. వాతావణ కాలుష్య నివారణకు చర్యలు చేపట్టడం, ప్రకృతి వనరులను పరిరక్షించడం, నేల సారవంతాన్ని కాపాడడం, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈరోజు అవగాహన కల్పిస్తారు. ప్రతి ఏటా జూన్ 17వ తేదీన ఎడారీకరణ, కరవు నివారణా అవగాహనా దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 1994 సంవత్సరంలో ఇచ్చిన పిలుపుమేరకు ప్రతిఏటా ఇదేరోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. కాగా... భూపరిరక్షణ కోసం ప్రత్యేకంగా దృష్టి సారించి నిర్వహిస్తున్న ఈ దినోత్సవానికి "మన వారసత్వం, మన భవిష్యత్తు కోసం సమిష్టిగా భూపరిరక్షణ" అనే ఇతివృత్తాన్ని నిర్ణయించారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దర్శించుకున్నారు. ఈరోజు ఉదయం కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి వికసిత భారత్ నిర్మాణం కోసం, రాష్ట్రంలో అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు.

---------------------------

జులై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్న మూడు నూతన నేర న్యాయ చట్టాలైన భారతీయ

న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయం చట్టాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్రప్రభుత్వం రూపొందించిన మూడు నూతన చట్టాల ద్వారా ప్రజలకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉందని చిత్తూరుజిల్లాకి చెందిన న్యాయవాది జయకుమార్ తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి వలసవాద చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తీసుకువచ్చిన నూతన చట్టాలు ప్రజలతో పాటు ప్రభుత్వ యంత్రాంగానికి  కూడా ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.

-----------------------------

జాతీయవాది, దేశభక్తుడు, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మి నరసింహం వర్ధంతి ఈరోజు. 1867వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామంలో ఆయన జన్మించారు. ద్రౌపది పరిణయం, శ్రీరామ జననం వంటి నాటికలు, రామచంద్ర విజయం, హేమలత వంటి నవలలు రాసిన ఆయన మహాకవి, కళాప్రపూర్ణ అనే బిరుదులు పొందారు. ఆయన రచించిన గణపతి నవల హాస్య రచనలలో ఎన్నదగినది. సామాజికంగా వెనుకబడిన వర్గాల కోసం పోరాడిన లక్ష్మీ నరసింహం. 1946 జూన్ 17వ తేదీన కన్నుమూశారు.

-----------------------------

అగ్నిపథ్ పథకాన్ని సైనిక్ సమాన్ స్కీమ్‌గా మళ్లీ ప్రారంభించినట్లు ప్రచారమవుతున్న సమాచారం అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సైనిక విధుల వ్యవధిని ఏడేళ్లకు పొడిగించడం, 60 శాతం శాశ్వత  సిబ్బంది, ఆదాయం పెంపు సహా అనేక మార్పులతో అగ్నిపథ్ పథకం పునఃప్రారంభించానే ఒక సందేశం సామాజిక మాధ్యమాలలో  ప్రచారం అవుతుందని పేర్కొంది. ఇందులో ఎటువంటి వాస్తవం లేదని, అగ్నిపథ్ పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ప్రత్రికా సమాచార కార్యాలయం పిఐబి స్పష్టం చేసింది.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట  మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక  ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

-----------------------------

రాష్ట్ర వ్యాప్తంగా బక్రీద్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మచిలీపట్నంలోని ఈద్గాలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమైక్యతకు, సౌభ్రాతృత్వానికి  ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందన్నారు. గుంటూరులో బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు శాసన సభ సభ్యులు మహ్మద్ నజీర్ పాల్గొని మాట్లాడుతూ.. సేవకు, త్యాగానికి  గుర్తుగా బక్రీద్‌ను జరుపుకుంటున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని పురాతన జామియా మసీదులో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మన్జీర్ జిలాని సమూన్ పాల్గొని మాట్లాడుతూ.. ముస్లింల రెండవ పెద్ద పండుగగా బక్రీద్‌ను జరుపుకుంటారని, ఈ పర్వదినం త్యాగాల సందేశాన్ని తెలియజేస్తుందన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా పోలవరంలో పర్యటించారు. ఉదయం ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నం ప్రాజెక్టు వద్దకు చేరుకుని... పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి, ప్రాజెక్టు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా.. ఈ మధ్యాహ్నం అధికారులతో పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

---------------------------

ప్రజల ఆకాంక్షల మేరకు పాలన అందిస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి అన్నారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామిని నిన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజలు తమకు ఘన విజయాన్ని అందించారని, వారి అవసరాలకు అనుగుణంగా, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

విజయవాడ నగరంలోని ప్రధాన రహదారులతోపాటు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ తోపాటు, అధికారులను ఆదేశించారు. విజయవాడలోని బందరు రోడ్డు, పటమట, బెంజిసర్కిల్, సమీపంలోని పలు ప్రాంతాల్లో గత రాత్రి ఆయన ఆకస్మికంగా పర్యటించి రోడ్లపై నిల్వ ఉన్న వర్షపు నీటిని పరిశీలించారు. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

---------------------------

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నిన్న విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నూతన ప్రభుత్వం హామీల అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, రాజధాని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పోలవరం నిర్వాసితుల కాలనీలను సందర్శించి వారికి సత్వర న్యాయం చేయాలని అన్నారు. రైతులకు స్మార్ట్ మీటర్లను తొలగించాలని రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

---------------------------

నేర న్యాయ విచారణలో ఎలక్ట్రానిక్ సాక్ష్యానికి ఈ రోజుల్లో చాలా ప్రాముఖ్యత ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర పేర్కొన్నారు. తాడేపల్లిలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ న్యాయవాదులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి నిన్న ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రశాంతకుమార్ మిశ్ర ప్రసంగిస్తూ, నిందితుడి లేదా అనుమానితుడి సెల్ ఫోన్‌ను సీజ్ చేయడం నుంచి పోలీసుల దర్యాప్తు ప్రారంభమవుతోందని క్రిమినల్ కేసులు వాదించే న్యాయ వాదులు ఇటువంటి ఎలక్ట్రానిక్ సాక్ష్యాల రంగంలో నిష్ణాతులు కావాలని సూచించారు.అమల్లోకి రానున్న కొత్త నేర న్యాయ చట్టాల గురించి విస్తృతంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు.

---------------------------

దేశంలో పెట్టుబడులకు సంబంధించిన పరిణామాలు, కంపెనీల విస్తరణ సమాచారం ప్రభుత్వానికి చేరేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టే విదేశీ విద్యాసంస్థలు, కార్పొరేట్, బిజినెస్ రంగాల్లో పరిణామాలన్నింటినీ తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోని పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా, పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్రానికి ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని తద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా జనసేన పార్టీ అధ్యక్షులు కె పవన్ కల్యాణ్ ఈ నెల 19న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఉపముఖ్యమంత్రితో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యా వరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా ఆయన బాధ్యతలు తీసుకోనున్నారని ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

=======================